క్లుప్తంగా

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామంలో అమ్మవారి, గ్రామ దేవత పండగలు పురస్కరించుకుని బుధవారం ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు ఆధ్వర్యంలో ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. జాతీయ రహదారికి అనుకుని చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగను పంపిణీ చేశారు.

గురుకుల పాఠశాలకు 14 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

సారవకోట: జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు గత నెలలో జరిగిన ప్రవేశ పరీక్షలో జేబీటీ పాఠశాల నుంచి 14 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ తెలిపారు. బుధవారం ఫలితాలు విడుదలయ్యాయన్నారు. తమ పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్



కూలిపోయే స్థితిలో ఉన్న బస్ షెల్టర్

సరుబుజ్జిలి: మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారిలో తమ్మినాయుడుపేట జంక్షన్ వద్ద గల బస్ షెల్టర్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్లు పగిలిపోయి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. శ్లాబు పెచ్చులు ఊడిపోతున్నాయి. బస్ షెల్టర్ సక్రమంగా లేక ప్రయాణికులు ఆరుబయట ఎండలో బస్సులు కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు



ఎంపీడీఓ కార్యాయలంలో సమ్మె నోటీసు అందిస్తున్న కార్మికులు

పొందూరు: వేతనాల పెంపు కోరుతూ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు బుధవారం పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయానికి సమ్మె నోటీసు అందించారు. ఈ సమ్మెను జూన్ ఒకటి నుంచి కొనసాగిస్తామన్నారు. గత నాలుగేళ్లుగా వేతనాలు పెంచలేదని పేర్కొన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. కనీస వేతనం రూ.18 వేలు చేయాలని నోటీసులో డిమాండ్ చేశారు. నోటీసు ఇచ్చిన వారిలో కనకరాజు, నాగరాజు, రాజేష్, అశోక్, మహేష్ తదితరులు ఉన్నారు.

ఆర్‌బీకేల్లో రైతు భరోసా లబ్ధిదారుల జాబితాలు



దూకులపాడు ఆర్‌బీకేలో జాబితా ప్రదర్శిస్తున్న ఏఓ, తదితరులు

నరసన్నపేట: మండలంలో 24 ఆర్‌బీకేల్లో రైతు భరోసా పథకం లబ్ధిదారుల జాబితా ప్రదర్శించామని, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 18వ తేదీలోగా తెలియజేయవచ్చని వ్యవసాయాధికారి కె.సునీత బుధవారం తెలిపారు. మండలంలో రానున్న ఖరీఫ్‌కు 8516 కుటుంబాలకు రైతు భరోసా అందనుందన్నారు. దూకలపాడుతోపాటు పలు ఆర్‌బీకేల్లో లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా పేర్లు నమోదు చేసుకొని డబ్బులు కట్టాల్సి ఉంటుందన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

ఎల్.ఎన్.పేట: విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయలు తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. తన కార్యాలయంలో బుధవారం సీఆర్పీలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ బడిలో చదవటం వల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు.

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



జలకలింగుపురంలో నవరత్నాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి విశేష స్పందన

మెళియాపుట్టి: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని మర్రిపాడు-సి, గ్రామ సచివాలయం పరిధిలోని జలకలింగుపురం, బంజీరు గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. నవరత్నాల కరపత్రాలను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారు ఉంటే అధైర్యపడొద్దని, వారికి సైతం అందజేస్తామన్నారు. గ్రామానికి చెందిన నడిమింటి గీత అనే మహిళ ఎమ్మెల్యేతో ఇంగ్లిషులో మాట్లాడుతూ సీఎం జగన్ అందిస్తున్నటువంటి ఉత్తమ పాలన మునుపెన్నడూ చేడలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అందరూ సంతోషంగా ఉన్నారని, మళ్లీ, మళ్లీ తమకు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలన్నారు. ఈ ప్రభుత్వం సంక్షేమంతోపాటుగా అభివృద్ధికి కూడా సమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు గ్రామానికి చెందిన న్యాయవాది నక్క బాబూరావు తెలిపారు. జలకలింగుపురం గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారులు ఎమ్మెల్యేతో కరచాలనం చేస్తూ.. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరం సంక్షేమ పథకాలు అందుకుంటున్నామన్నారు. జెడ్పీటీసీ గూడ ఎండయ్య, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బైపోతు ఉదయ్ కుమార్, శశిభూషణ్ రావు, పోలాకి జయమునిరావు, ఎంపీటీసీ నక్క కాత్యాయని, రామరాజు, జమ్మయ్య, ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని, ఏఓ ధానకర్ణుడు, ఏఈ శ్రీనివాసరావు, ఏపీఎం లలిత, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే హక్కు కలమటకు లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీని, ఎమ్మెల్యే రెడ్డి శాంతిని విమర్శించే హక్కు టీడీపీ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్రకు మద్దతుగా కలమట కొత్తూరులో ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నాడు-నేడు - మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ జెండాపై 2014లో ఎమ్మెల్యే గెలిచిన కలమట కొద్దిరోజుల్లోనే టీడీపీకి అమ్ముడుపోయారన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడిన కోట్లాది రూపాయలు అక్రమార్జన చేసిన కలమట నీతులు చెప్పడం అన్యాయమన్నారు. నీరు-చెట్టు పథకం ద్వారా స్వంత పంచాయతీ మాతలకు సుమారు మూడు కోట్ల నిధులు కేటాయించుకుని పనులు చేయకుండానే బినామీల పేరుతో స్వాహా చేసిన కలమట వైఎస్సార్‌సీపీని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిర్వాసితులకు ప్రభుత్వం చెల్లించిన ప్యాకేజీలు, ఇళ్ల విలువల్లో కమీషన్లకు కక్కుర్తిపడి నిర్వాసితులకు అన్యాయం చేశారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూడలేకనే కలమట విమర్శలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్ని విధాలా కృషి చేస్తున్నారన్నారు. జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎంపీటీసీ వనుము లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, కామక త్రినాథరావు, గండివలస ఆనందరావు, రాడ రాజు, గంధవరపు నాగేంద్ర, గొంటి రమేష్ పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ, సర్పంచ్

కొత్తూరు: వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులపై రాయితీలు అందిస్తుందని స్థానిక ఏఓ శ్రీనివాసరావు అన్నారు. కొత్తూరు మండలం ఓండ్రుజోల రైతు భరోసా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగు, తట్టిజనుము విత్తనాలను 50 శాతం రాయితీపై రైతులకు బుధవారం ఏఓ, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ జి.ఈశ్వరి పంపిణీ చేశారు. రైతులు కోసం ప్రభుత్వం అందిస్తున్న పలు రకాల పథకాలను వివరించారు. రైతులు రాయితీలను ఉపయోగించుకోవాలని కోరారు. పచ్చరొట్ట విత్తనాలను సాగు చేయడంతో భూసారం పెరుగుతుందని, ఎరువుల ఖర్చు తగ్గుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువు వినియోడించడం వల్ల ఆరోగ్యవంతమైన పంట పండుతుందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు సౌజన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం, సత్యం, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జూన్ 5 నుంచి పాత వస్తువులు సేకరణ

ఆమదాలవలస: ఆమదాలవలస పురపాలక సంఘంలో రెడ్యూస్-రీసైకిల్-రీయూజ్ నినాదంతో పది రోజులపాటు పాత వస్తువులను సేకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు రీసైకిలింగ్ ప్రక్రియకు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్ తదితర వస్తువులను పెద్ద ఎత్తున సేకరించనున్నట్లు తెలిపారు. మోనింగివారి వీధిలో ఉన్న ఐడీఎస్ఎంటీ కాంప్లెక్స్ వద్ద స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. పాత వస్తువులను రీయూజ్-రీసైకిల్ కోసం ప్లాంట్‌కు పంపేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

మహాయజ్ఞంలో మంత్రి ధర్మాన



మహాయజ్ఞంలో మంత్రి ధర్మాన, పక్కనే హరిసూర్యప్రకాష్

అరసవల్లి: రాష్ట్ర దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం విజయవాడలో నిర్వహిస్తున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత లక్ష్మీ మహాయజ్ఞంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం బుధవారంతో ముగిసిన సందర్భంగా పలువురు ప్రముఖులతో పాటు ధర్మాన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనే లక్ష్యంతోనే ఈ మహాయజ్ఞాన్ని ప్రభుత్వమే ప్రాధాన్యతగా చేపట్టిందన్నారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జిల్లా దేవదాయశాఖాధికారి వి.హరి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ఎస్పీ జీఆర్ రాధిక



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: మహిళా పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో మహిళా పోలీసులకు మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వ్యాధుల నిర్ధారణతో పాటు సాధారణ వైద్య పరీక్షలు జరిపేందుకు శిబిరాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. మహిళా పోలీసులకు సుగర్, బీపీ, గుండె వ్యాధుల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారన్నారు. అత్యవసర వైద్య సహాయం అవసరమైన వారికి మెడికవర్ ఆస్పత్రిలో ఉచిత కన్సల్టేషన్, వైద్య ఖర్చుల్లో 50 శాతం రాయితీ అందిస్తారన్నారు. వైద్య పరీక్షలు విధివిధానాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, వైద్యులు ప్రకాష్, అమూల్య, అనిరుధ్, ఆర్ఐ ఉమామహేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, (తెలుగు, ఇంగ్లిష్ మీడియం), సీఈసీ, హెచ్ఈసీ జనరల్ గ్రూప్‌లు, ఎంఅండ్ఏఈ, ఏఅండ్‌టీ, ఎల్ఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్), ఫిషరీస్, ఒకేషనల్ గ్రూపులు ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు జూన్ 14 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కళాశాలలో అత్యాధునిక సైన్స్ లాబరేటరీలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనుభవం గల అధ్యాపకులు ఉన్నారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

12 గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు పూర్తి

సారవకోట: మండలంలో జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా భూముల రీ సర్వే చేసిన 12 రెవెన్యూ గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ప్రవల్లికాప్రియ బుధవారం తెలిపారు. వెంకటాబాద్, అక్కివలస, బుడితిపేట, పాప్పంగి, కొమ్ముసరియాపల్లి, సారవకోట, అవలింగి, చీడిపూడి, కూర్మనాథపురం, చరణ్‌దాసుపురం, అంగూరు, దాసుపురం గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తయిందన్నారు. రామచంద్రాపురం, అన్నుపురం, కొత్తూరు, కిన్నెరవాడ రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తయిదని, ఇంకా స్టోన్ ప్లాంటేషన్ ప్రారంభించలేదన్నారు. కుమ్మరిగుంట, శివరాంపురం గ్రామాల్లో ప్రస్తుతం రీ సర్వే జరుగుతుందన్నారు.

ఉపాధి పనుల్లో జాగ్రత్తలు పాటించాలి

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం వేతనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ ఆర్ కాశీప్రసాద్ బుధవారం ప్రకటనలో సూచించారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఉదయం 6 గంటలకు పనిలోకి వెళ్లి 10 గంటల వరకు చేయాలన్నారు. సాయంత్రం 4 గంటలకు పనిలోకి వెళ్లి 6గంటల వరకు పనిచేయాలని సూచించారు. ఎండ తీవ్రత పెరగక ముందే పని ప్రదేశం నుంచి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలన్నారు. ఉపాధి పనులకు వెళ్లే వేతనదారులు పని ప్రదేశానికి ఒక్కొక్కరు రెండు, మూడు లీటర్ల నీటిని తీసుకువెళ్లాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

భూ ఆక్రమణదారులకు నోటీసులు

కోటబొమ్మాళి: మండలంలోని చిట్టివలస పంచాయతీ చవితిపేట గ్రామంలో సర్వే నంబర్ 203-3బీ లోని 1.64 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని సర్పంచ్ ఎస్.వెంకటరమణ టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి ఇటీవలి ఫిర్యాదు చేశారు. దీంతో సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు 12 మంది ఆక్రమణదారులను గుర్తించామని, వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మధు బుధవారం తెలియజేశారు. ఈనెల 20వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో జరగనున్న రెవెన్యూ పబ్లిక్ హియరింగ్‌కు హాజరై భూమిని ఖాళీ చేస్తున్నట్లు అఫిడవిట్ సమర్పించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని నోటీసుల్లో పేర్కొన్నారు.

సమన్వయంతో ఉత్సవాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పక్కన సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- నీలమణి ఉత్సవాల నిర్వహణకు రూ.1.30 కోట్ల ప్రభుత్వ నిధులు మంజూరు

పాతపట్నం: ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలను అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు సమన్వయంతో నిర్వహించాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. అమ్మవారి ఆలయ సమీపంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో బుధవారం ఉత్సవాల నిర్వహణపై టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాలు విజయవంతం చేసేందుకు అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు సరఫరా, విద్యుత్, వైద్యం, రవాణా, ట్రాఫిక్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉత్సవ హెడ్ కమిటీ సభ్యుడు నూలు బుజ్జి మాట్లాడుతూ ఉత్సవాలకు విద్యుత్‌శాఖ రూ.93 లక్షలు, ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ట్యాంకుకు రూ.13 లక్షలు, పంచాయతీరాజ్‌శాఖ నుంచి బూరగాం-పర్లాకిమిడి మట్టి రహదారికి (డైవర్షన్ రోడ్డు) రూ.13 లక్షలు, జెడ్పీ నుంచి రూ.2లక్షలు, కలెక్టర్ రూ.5 లక్షలు, మండల పరిషత్ నుంచి రూ.5 లక్షలు మొత్తం రూ.1.30 కోట్ల నిధులను ఎమ్మెల్యే తీసుకు వచ్చారన్నారు. ప్రొబిషనరీ డిప్యూటీ కలెక్టర్ ఆంబ్రీష, టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాసరావు, డీఈఈ మధుసూదనరావు, సీఐ ఎం.వినోద్‌బాబు, ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, ఉత్సవ హెడ్ కమిటీ సభ్యులు లింగాల రవికుమార్, శిర్ల జోగారావు, అన్ని శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ హెడ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

- సహాయ కార్మిక అధికారి జయశంకర్



ధనుపురంలో భవన నిర్మాణ కార్మికలతో మాట్లాడుతున్న జయశంకర్

హిరమండలం: రాష్ట్రంలో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రతీ దుకాణం, పరిశ్రమలు, కర్మాగారాల్లో భవన నిర్మాణ రంగ సంస్థల యజమానులు తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని సహాయ కార్మిక అధికారి వి.జయశంకర్ అన్నారు. మండలంలోని ధనుపురం, తంప గ్రామాల్లో భవన నిర్మాణాల చేపడుతున్న కార్మికులు, యజమానులను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని గంటలు ఉదయం, సాయంత్రం వేళల్లో మార్పులు చేసుకునేలా చూడాలన్నారు. కార్మికులకు పీస్ రేట్ ధరలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీటి సదుపాయంతో పాటు అత్యవసర ఐస్ ప్యాక్, వడ దెబ్బ నియంత్రణ పదార్థాలు అందుబాటులో ఉంచాలని యజమానులకు సూచించారు.

విద్యార్థికి ఎమ్మెల్యే అభినందన



రాకేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: విద్యకు పెద్దపీటవేస్తూ విద్యార్థుల భవితకు దిక్సూచిలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పది ఫలితాల్లో 540 మార్కులు సాధించి, పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన జలకలింగుపురం గ్రామానికి చెందిన విద్యార్థి ఎం.రాకేష్‌ను బుధవారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత స్థానాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరఫున సహాయ, సహకారాలు అందిస్తూ అండగా ఉంటామన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు రామకృష్ణ, లక్ష్మిలను అభినందిస్తూ.. చక్కగా చదివించాలని సూచించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్..



వసప వద్ద నిలిచిపోయిన వాహనాలు

కొత్తూరు: మండలంలోని వసప గ్రామంలో చెవిటమ్మ తల్లి పండగలు బుధవారం ముగిశాయి. ఆఖరి రోజు గ్రామంలో విందులు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలోకి మధ్యాహ్నం ఒకే సమయానికి వాహనాలతో వేలాది మంది రావడంతో ప్రధాన రహదారితోపాటు గ్రామంలోని రోడ్లన్నీ జనాలతో నిండిపోయాయి. కొత్తూరు నుంచి నివగాం వెళ్లేందుకు గంటల తరబడి రోడ్డుపై వేచి ఉండాల్సి వచ్చింది. తీవ్రమైన ఎండలు కాయడంతో బైక్‌లపై వచ్చిన ప్రజలు ఎండలో గంటల తరబడి నిల్చొని అవస్థలు పడ్డారు.

గ్రంథాలయంలో చదరంగం పోటీలు

నరసన్నపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు చదరంగంతోపాటు పలు పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించారు. కబడ్డీ, చదరంగం తదితర పోటీలు లైబ్రేరియన్ చాయ్‌రతన్ ఆధ్వర్యంలో చేపట్టారు.



చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాపాకలో లో ఓల్టేజ్ సమస్య

పొందూరు: మండలంలోని రాపాక గ్రామంలో లో ఓల్టేజ్ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ సమస్య తలెత్తడంతో ఫ్యానులు, బల్బులు, ఫ్రిజ్‌లు, ఏసీలు పాడైపోతున్నాయని ప్రజలు చెబుతున్నారు. తక్షణమే విద్యుత్‌శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.